# సాయం

## అవసరాల రామకృష్ణా రావు


రిసెప్షనిస్టు వసుంధర అడుగుల చప్పుడు సీనియర్ ఆఫీసరు శివప్రసాదుకు గుర్తే.

"ప్లీజ్ సిడౌన్" అన్నాడు త లెత్తకుండానే.

కాని ఆవిడ కూర్చోలేదు. అలా కూర్చోకూడదు, ఆ ఆఫీస్ రూల్స్ ప్రకారం. ఆ విషయంలో ఆవిడే కాదు అతనూ ఏం చెయ్యలేడు. తలమునకలైన ఆఫీసు పనిలో ఎంతగా ఊపిరి సలపకపోయినా ఆవిడ సమక్షంలో వా ళ్ళిద్దరి మధ్య తేడా అతను తలపోసుకోకుండా ఊరుకోలేడు.

తను ఇలా మెత్తని కుర్చీలో కూర్చోడం, ఆవిడ అలా నిలబడ్డం - ఇది కాదు, బతుకు పోరాటాన్ని ఎదుర్కొనే మానసిక బలాన్ని బట్టి హోదాల్ని నిర్ణయించగలిగితే ఆమెను ఇంకా ఎత్తున కూచోబెట్టి, తనకు కటిక నేల మీద జాగా ఇవ్వాలని శివప్రసాద్ ఉద్దేశం.

తన కేం మగాడు! తల్లీదండ్రీ లేకపోతే నేం పిల్లలు లేని పిన్నీ చిన్నాన్నలు ప్రేమతో పెంచి పెద్ద చేశారు. చదువు చెప్పించారు. పెళ్ళి చేశారు.



సాం తిల్లు ఉంది. మంచి ప్రైవేట్ ఫర్మ్‌లో పెద్ద ఉద్యోగం. కారూ, బంగళా, దేనికి లోటని?

తను ఎప్రంటిస్‌గా ఆ ఫర్మ్‌లో చేరేనాటికి వసుంధర భర్త గవర్రాజు కెమిస్ట్‌గా అక్కడ పనిచేస్తూ ఉండేవాడు. ఇంజనీరింగ్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశాడు గనక తనకు రెండేళ్ళలోనే ప్రమోషన్ వచ్చింది. తనకు పెద్ద ఉద్యోగం వచ్చిన ఏడాదే ఆ ఘోరం జరిగింది. ఓ గ్యాసు లీకు యాక్సిడెంటులో మరో ఇద్దరు అసిస్టెంట్స్‌తో పాటు గవర్రాజూ ఘోర మరణానికి గురి అయ్యాడు. అప్పుడు వసుంధర పెద్ద కొడుక్కి నాలుగో ఏడు. రెండోవాడికి మూడు. ఒళ్ళో మూడు నెలల పాప. ఫర్మ్ రూల్సు ప్రకారం ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు. చెల్లించారు కూడా. ఆవిడ ఏ ఎనిమిది దాకానో చదివింది. బతికు న్నన్నాళ్ళూ పెళ్ళాం కాలు కదపకుండా నెత్తి మీద పెట్టుకుని చూసుకున్నాడు గనక వసుంధరకు వచ్చిన హిందీ కూడా అంతంతమాత్రమే. అప్పటి ఆమె క్వాలిఫికేషను అంతే.

స్వతహాగా త నేమో తన ప నేమో తప్ప గట్టిగా ఎదుటివాడితో నైనా రెండు ముక్కలు మాటాడ్డం అతనికి అలవాటు లేదు. అయినా గవర్రాజు

## జీవిత దృశ్యాలు

కుటుంబానికి జరిగిన ఆపదకు చలించకుండా ఉండలేక రంగంలోకి దిగాడు. పెద్దింటి పిల్ల కదా క్లాస్ ఫోర్ ఉద్యోగానికి వసుంధర ఒప్పుకో దేమో, పిల్లలతో కుదరదేమో అని సందేహించాడు. క్లాస్ ఫోర్ వాళ్ళకు క్వార్టర్ల సదుపాయం ఆ రోజుల్లో లేదు. ఫర్మ్ వాళ్ళు తగిలేస్తా రేమో, బొంబాయి లాంటి ఊళ్ళో ఏ పంచా దొరక్క పిల్లలతో ఎక్కడ ఇబ్బంది పడుతుందో అని కంగారు పడ్డాడు. కాని సీరియస్‌నెస్‌కూ, సిన్సియారిటీకీ మారు పేరైన తన మాట ఫర్మ్ మేనేజ్‌మెంటు పెద్ద మనసుతో మన్నించింది. ఎప్పుడూ లేని మధ్యవర్తిత్వం వహించి విధి వంచితులైన ఆ తల్లీపిల్లల్ని వీధి పాలు కాకుండా కాపాడగలిగాడు.

ఏ మనిషి కయినా ఏ స్థితిలో అయినా ఇంకొకరి సహాయం అనేది. కొంతవరకే. సాటి మనిషి శాశ్వతంగా సహాయం కోరడం, కళ్ళబడని అదృశ్య శక్తి మీద మూఢ విశ్వాసం ఉంచడం మనిషిలోని బలహీనతలను చూపిస్తుంది. వసుంధరలో ఈ రెండూ మాటవరస కయినా కనిపించవు. అందుకే శివప్రసాద్ దృష్టిలో ఆమె కంతటి అత్యున్నత స్థానం. భర్త పోయేనాటికి పెనుగాలిలో చిక్కుకున్న లేత మొక్కలాంటి వసుంధర ఈ పదమూడు పద్నాలుగేళ్ళలో ఒకరికి నీడ చూపించే వృక్షంలా తన కళ్ళ ముందే ఎదగడం ఎంతో ఆశ్చర్యంగా, ఆనందదాయకంగా ఉంటుంది.

త నేదో పెద్ద

# యువతీ యువకులకు కొత్త శీర్షిక



## రేగింగ్ - నా అనుభవం

కొలేజీలలో, యూనివర్సిటీలలో కొత్తవారు 'కోడళ్ళ' వలె ప్రవేశించే ఋతువు! వారిని సీనియర్లు [అత్తగార్లు, ఆడబడుచులు] రేగింగ్ పేరున 'ఏడిపించే!' ఋతువూ ఇదే.

రేగింగ్ పేరిట కొంతమంది సీనియర్లు సరదాగా తేలికగా జూనియర్లను ఆట పట్టిస్తారు. ఆ తర్వాత అందరూ ఒక కుటుంబంలో సభ్యుల్లా కలిసిపోతారు.

కాని కొన్ని కొన్నిచోట్ల కొందరు సీనియర్లు రాక్షసులై కొత్తవారి లేత మనసులు తీవ్రంగా గాయపడేలా ప్రవర్తించగా, ఆ జూనియర్లు మనసు వికలమై బెదరి చదువులు మానేసిన సందర్భాలు, ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలూ లేకపోలేదు. ఇటువంటి నేపథ్యంలో - కాలేజీల్లో, యూనివర్సిటీల్లో చదువుతున్న యువతీయువకులు మీ మీ అనుభవాలు ఏమిటి? రేగింగ్ వాంఛనీయమా, కాదా?

మీ అనుభవాన్ని, అభిప్రాయాన్ని క్లుప్తంగా 15-20 పంక్తులకు మించకుండా రాసి మీ పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో బాటు మాకు ప్రచురణార్థం పంపండి!

మీరు పంపే కవర్ పైన 'రేగింగ్' అని రాయడం మరవకండేం?

సంపాదకుడు

---

ఉద్ధరించా డనుకోడం వెర్రితనం. ఒకసారి తన కాళ్ళ మీద తను నిలబడగలిగాక ఇక ఎవర్నీ దేనికీ యాచించలేదు ఆవిడ. పిల్లలు ముగ్గుర్నీ ఎవరైనా గర్వపడేలా పెంచింది. పెద్ద పిల్లలిద్దరూ ఇంటరు ఫస్టు క్లాసులో పా సయారు. వాళ్ళిద్దరూ ఇప్పుడు ఏదో కోచింగ్ సెంటర్లో సికింద్రాబాద్‌లో ఎమ్‌సెట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నారు. ఇక తల్లి దగ్గిరే ఉండే బేబీ అయితే ఆ చురుకుదనం చూసి ముచ్చటపడని వా రుండరు. దానికి రాని భాష లేదు, అది ఆడని ఆట లేదు! ఇక వసుంధర అయితే ప్రైవేటుగా కట్టి ఎప్పుడో పూర్తిచేసింది గ్రాడ్యుయేషన్. ప్రైవు హయ్యర్ పా సయింది. హిందీలో విశారద పరీక్ష పాసయింది. సీనియర్ రిసెప్షనిస్టుగా ప్రమోటై రెండు వేలు తక్కువ కాకుండా తెచ్చుకుంటోంది. ఒకర్ని ఒక మాట అనదు, ఒకరిచేత ఒక్క మాట పడదు. ఉద్యోగరీత్యా ఎంత టెన్షను ఏర్పడ్డా మొహం మీద ఆ చిరునవ్వు చెదరనివ్వదు.

త నేదో ఆవిణ్ణి నిలబెట్టానని అందుకే శివప్రసాద్ ఎప్పుడూ అనుకోడు. అవకాశం వచ్చినా ఆవిడకు తోడ్పడి తీరాలనే తపన అతని బలహీనతేమో మరి!

"ఈ రాత్రికే రిజర్వేషన్స్ దొరికేయి సార్! నేనూ, బేబీ ఇవాళే బయలుదేరి వెడుతున్నాం. ఫైవ్ డేస్ లీవ్‌కు అప్లై చేశాను. ఈ సంక్రాంతి పిల్లల్తో సికింద్రాబాదులో గడిపి వస్తాను. మళ్ళి నేను సోమవారం డ్యూటీలో జాయిన్ అవుతాను. ఫైల్సన్నీ మేరీకి అప్ప చెప్పేను. పెండింగ్‌లో ఉన్న టైపింగ్ మేట రంతా అరుణ్ బిస్వాల్‌కి ఇచ్చాను. మరి నేను వెళ్ళి రానా సార్?"

వసుంధర నోరు విడిచి అడక్కుండానే తను చేయగల సాయం అతని మనసులో మెదిలింది.

వసుంధర కొడుకు లిద్దరూ తల్లికి బాగా దూరంగా ఆ మహా పట్నంలో చదువులు వెలిగిస్తున్నారు. ఎంత క్రమశిక్షణలో ఉన్న పిల్లలైనా పెద్దల డబ్బు నెల నెలా అందుతూంటే ఈ కాలపు ఆకర్షణలకు తట్టుకుని వయ సొస్తున్న పిల్లలు ఓ దార్లో పడడం అంత సులువా! తన పిన్ని చిన్నాన్నా ఈ మధ్యే తన సొం తింటికి వచ్చేశారని తెలియబరచారు. అన్నట్టు చిన్నాన్న రిటైరయి పదే ళ్ళయినా ఇంకా మహా ఏక్టివ్‌గా ఉండి ఉండాలి. లేపోతే ఇలా వస్తూనే ఓ మేథమెటిక్స్ కోచింగ్ సెంటరు ఓపెన్ చేస్తాడా! అంతేకాదు. వా ళ్ళింట్లో ముందు వాటా వాళ్ళు ఖాళీ చేశారని పిన్ని రాసింది. వసుంధర కొడుకులు ఎలాగూ నాలు గొందలు ఇచ్చి వేరే వాటాలో ఉన్నారని ఆవిడే చెప్పింది. వాళ్ళని తమ వాటాలో దింపి చిన్నాన్న సంరక్షణలో పెడితే? మగపిల్లలు చేతి కంది వస్తే ఇక బేబీ భారం ఒకటే ఆవిడకు మిగులుతుంది.

ఒకరి సహాయం అర్థించని పద్ధతిలో ఆవిడ తన జీవితం దిద్దుకుంది. ఇ వన్నీ చెప్పి తమవాళ్ళ సాయం పొందమంటే ఆవిడ ఎలాగూ వినదు. అన్నీ వివరంగా రాసి వసుంధర చేతి కిస్తూ శివప్రసాదు అన్న దిదీ:

"న న్నింతవాడిని చేసిన మా వాళ్ళు సికింద్రాబాదులో ఉన్నారు. ఇదిగో ఎడ్రసు. మా క్షేమం తెలియజేస్తూ ఈ ఉత్తరం మా చిన్నాన్న కిస్తారుగా!"

శివప్రసాదు చెప్పిన ఎడ్రసు పట్టుకుని, సికింద్రాబాదు చేరిన మూడో రోజున వసుంధర ఆ ఇంటికి వెళ్ళి వాళ్ళను కలుసుకుంది. అత నిచ్చిన ఉత్తరం వాళ్ళ కందజేసింది. ఆ ఉత్తరంలో ఉదహరించబడిన వ్యక్తి అంత నీటుగా ఫ్రెష్‌గా ఉండడం వాళ్ళు తట్టుకోలేకపోయి ఉండాలి. వాళ్ళబ్బాయి దగ్గిర పనిచేసే క్రింది మనిషిగా తప్ప మరోలా చూడలేకపోయి ఉండాలి. లోపలి కెళ్ళి రెండు ముక్కలు రాసి కవర్లో పెట్టి అంటించి ఇచ్చాడు.

"చూ డమ్మాయ్... అరబస్తా బియ్యం మూట మావాడి కోసం సిద్ధం చేసి ఉంచాం. కొత్త మంచాలు ప్యాక్ చేయించి ఉంచాం. ను వ్వెళ్ళేటప్పుడు ఇలా వచ్చి తీసుకెళ్ళి మావాడికి అందించు" అనే బరువు కూడా ఆమె మీద వేశారు.

ఓసారి ఎక్కితే ఎప్పు డెక్కడ ఆగిపోతామో ఎరగని ఈనాటి రైలు ప్రయాణాల్లో, అందులో ఇంత దూరం, అందునా ఓ ఆడపిల్లతో ఓ ఒంటరి ఆడది, ఇంత భారం తల కెత్తుకోడం - అసాధ్యం అని ఆ క్షణమే నిర్ణయించుకుంది వసుంధర. అవి తీసుకురాకుండానే బొంబాయి వచ్చేసింది.

"నా కెలా కుదురుతుంది?" అంటూ శివప్రసాదుతో స్పష్టంగా చెప్పింది.

అయితే ఉత్తరంలో ముసలాయన ఏం రాశాడో శివప్రసాదుకే ఎరిక. "ఏనాడో మొగుడు పోయి, ఏ నలభయ్యో దాటిన మనిషి, ఇప్పుడు విడిచిన పువ్వులా ఇలాగట్రా ఉండడం! దీనికా మనం ఉపకారం చెయ్యవలసింది! బాగా మోజులో పడ్డట్టున్నావు. నీ సంసారానికి అపకారం కాకుండా చూసుకో."

అతని తల తీసేసి నట్టయింది. వసుంధర లాంటి వ్యక్తికి తన లాంటివాడు ఏ సాయం చెయ్యకుండా ఉండటమే అన్నిటి కన్న గొప్ప సాయం!

[వచ్చే వారం ★ భూభారం పురుషులూ, శిరోభారం స్త్రీలూ]